## త్వరలో మహిళా కాంగ్రెస్ కమిటీలు: కొమ్మూరి

జనగామ టౌన్, జనవరి 19: త్వరలోనే జిల్లాలో మహిళా కాంగ్రెస్ గ్రామ, మండల కమిటీలు పూర్తి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో బడికె ఇందిర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లేందుకు మహిళా నాయకులు కృషి చేయాలన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతోందని, మహిళలకు అందజేసే పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు నీలం పద్మ, పుష్పారెడ్డి, వంగాల కల్యాణి, సుంకరి నిర్మల తదితరులు పాల్గొన్నారు.



టెక్నోజియాన్‌లో నగరానికి చెందిన పాఠశాల విద్యార్థి తయారు చేసిన ఎగ్జిబిట్ గురించి అడిగి తెలుసుకుంటున్న నిట్ విద్యార్థి

# నిట్‌లో సాంకేతిక సంబురం

## ఉత్సాహంగా మొదలైన టెక్నోజియాన్

- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు
- 40కి పైగా ఈవెంట్ల నిర్వహణ
- క్యాంపస్‌లో సందడి చేస్తున్న మినీ భారతం
- కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఊపిరి
- నేడు, రేపు కొనసాగనున్న వేడుకలు

7

నగరంలోని ప్రతిష్ఠాత్మక నిట్‌లో సాంకేతిక ఉత్సవం 'టెక్నోజియాన్-2024' శుక్రవారం సందడిగా మొదలైంది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీయడంతో పాటు పరస్పరం తమ అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకునేందుకు నిట్ ప్రతీ ఏటా 'టెక్నోజియాన్'ను నిర్వహిస్తోంది. ఈనెల 21 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో 40కిపైగా ఈవెంట్లను ప్రదర్శిస్తారు. దేశంలోని వివిధ నిట్ కళాశాలల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఈ ఈవెంట్లలో పాలుపంచుకోనున్నారు. ఈ సంవత్సరం ఇంజనీయస్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకను శుక్రవారం ప్రఖ్యాత ఎరోస్పేస్, మిస్సైల్ సైంటిస్టు ప్రొఫెసర్ సుందర రాజన్ ప్రారంభించాల్సి ఉండగా, అనారోగ్య కారణాలతో హాజరుకాలేక పోయారు. దీంతో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి. సోమశేఖర్ టెక్నోజియాన్‌ను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థుల తో క్యాంపస్ అంతటా మినీ భారతం కళ్లకు కడుతోంది.

-ఆంధ్రజ్యోతి, హనుమకొండ/కాజీపేట



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న నిట్ కళాశాల రీసెర్చ్ కన్సల్టెన్సీ డీన్ వి.టి. సోమశేఖర్



జఫర్‌గడ్ మండలం కూనూరు హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

# 'పది'పై పట్టు.. విజయానికి మెట్టు

## ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు

- టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక తరగతులు
- సమీపిస్తున్న వార్షిక పరీక్షలు
- ఈ ఏడాది నుంచి సైన్స్‌కు రెండు పేపర్లు
- జిల్లాలో 6,695 మంది విద్యార్థులు

జఫర్‌గడ్, జనవరి 19: ఉన్నత విద్యను అభ్యసించాలంటే పదో తరగతి ఎంతో కీలకం. ఈ పరీక్షల్లో గట్టెక్కితేనే ఇంటర్, ఆ తరువాత పై చదువులను చదివేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం ఈ ఏడాది జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులతో నిరంతర సాధన చేయిస్తున్నారు. గతేడాది నిర్వహించిన ఎస్ఎస్‌సీ పరీక్షల్లో జనగామ జిల్లా 91 శాతం ఉత్తీర్ణతతో 10వ స్థానం సాధించింది. ఈసారి వంద శాతం లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ మేరకు జనవరి 2 నుంచి పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు నిర్దేశిత సమయాల్లో బోధిస్తూ విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. జిల్లాలో 102 జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ, ఆదర్శ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యాలయాలతో కలిపి మొత్తం 182 పాఠశాలల్లో 6,695 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఇందులో 3,135 మంది బాలురు, 3,560 మంది బాలికలు ఉన్నారు.

### ఉత్తమ ఫలితాల సాధన కోసం..

ప్రతీ సబ్జెక్టులో విద్యార్థులు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు, విద్యార్థులు అభ్యాస పుస్తకాలు అనుసరించేలా ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులతో పాటు గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లోని విద్యార్థులకు సైతం ఈ తరహాలోనే కార్యక్రమం అమలు చేస్తున్నారు. మార్చిలో నిర్వహించే ఎస్ఎస్‌సీ వార్షిక పరీక్షలకు ముందస్తు ప్రణాళికతో విద్యార్థులు అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు దృష్టి సారించేలా కార్యాచరణ చేపట్టారు. మరోవైపు ఉన్నతాధికారులు సైతం తరచూ పాఠశాలలు తనిఖీ చేస్తూ పదో తరగతి విద్యార్థుల లక్ష్య కార్యక్రమం అమలు తీరును విశ్లేషించేలా పర్యవేక్షణ పెంచుతున్నారు.

### రెండు పూటలా అదనపు తరగతులు..

మార్చి 18 నుంచి 30 వరకు జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు చక్కటి ఫలితాలతో రాణించాలనే లక్ష్యంతో విద్యాశాఖ కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేస్తోంది. ఇప్పటికే సర్కారు బడుల్లో డిసెంబర్ మొదటి వారం నుంచి సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులను నిర్వహించగా, జనవరి 2 నుంచి ప్రతి రోజు ఉదయం 8-30 నుంచి 9-30 గంటల వరకు, సాయంత్రం 4-45 నుంచి 5-45 గంటల వరకు గంట సమయం చొప్పున విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మరో రెండు నెలల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు ఉండడంతో ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. ఉదయం, సాయంత్రం ఏఏ సబ్జెక్టులు బోధించాలో కూడా షెడ్యూల్ విడుదల చేశారు.

### వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ...

చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ సంసిద్ధులుగా తయారు చేస్తున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుడు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా వినడంతో పాటు అందులో ఏమైనా సందేహాలు నెలకొంటే ప్రత్యేక తరగతుల్లో నివృత్తి చేసుకుంటున్నారు. వారానికి ఒకసారి స్లిప్ టెస్టు (లఘు పరీక్షలు)లను నిర్వహిస్తున్నారు. ఆ పరీక్షలో వచ్చిన ఫలితాల ఆధారంగా విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తున్నారు.

### సైన్స్ సబ్జెక్టుకు రెండు పేపర్లు ...

ప్రభుత్వం పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేసింది. మార్చిలో నిర్వహించే ఈ పరీక్షల్లో సామాన్యశాస్త్రం (సైన్స్) సబ్జెక్టును ఈ ఏడాది నుంచి రెండు రోజులు నిర్వహించనున్నారు. ఫిజికల్ సైన్స్ (భౌతికశాస్త్రం), బయోలాజికల్ సైన్స్ (జీవశాస్త్రం) వేరు వేరు రోజుల్లో రెండు పేపర్లుగా పరీక్ష నిర్వహిస్తారు. కరోనాకు ముందు హిందీ తప్ప మిగతా అన్ని సబ్జెక్టుల్లో రెండు పేపర్లు ఉండేవి. వాటిని ఆరు పేపర్లకు కుదించారు. సైన్స్ సబ్జెక్టును రెండు విభాగాలుగా పరీక్షను విడివిడిగా వెంట వెంటనే ఒక్కరోజే నిర్వహించేవారు. అయితే ఈ సబ్జెక్టును ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ రెండు పేపర్లుగా.. రెండు పరీక్షలు.. రెండు రోజులు నిర్వహించాలని గత కొన్నేళ్లుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదించింది.

### ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా కార్యాచరణ..

కె.రాము, జిల్లా విద్యాశాఖాధికారి



పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నదే లక్ష్యం. ఈ దిశగా తగు కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా వార్షిక పరీక్షలకు మూడు నెలల ముందు నుంచే ప్రత్యేక తరగతులతో పిల్లలను సన్నద్ధం చేస్తున్నాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇంటి వద్ద చదువుకునేలా ప్రయత్నించాలి. ఉత్తమ గ్రేడ్‌లతో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రత్యేకంగా 'లక్ష్య' కార్యక్రమం అమలు చేస్తున్నాం. ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థుల ప్రగతిని విశ్లేషించి తగిన సూచనలు చేస్తున్నాం. సబ్జెక్టుల వారీగా ఇబ్బందులను తొలగింపజేసి, విద్యార్థులు పరిపూర్ణంగా పరీక్షలు రాసి చక్కటి ఫలితాలు సాధించేందుకు అభ్యసన దీపికలను అందజేశాం. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం..

వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

ఆర్‌టీవో అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

వివరాలు : 8 లో..









## నీళ్లున్నా సాగుకు ఇవ్వలేకపోతున్నాం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- హైదరాబాద్ జలసౌధలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష



జలసౌధలో ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌తో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 19: రిజర్వాయర్లలో నిండుగా నీళ్లున్నా పంటపొలాలకు అందించలేకపోతున్నామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన హైదరాబాద్‌లోని జలసౌధలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ల కింద కాలువల పనులు పూర్తి కాకపోవడం, పూర్తైన కాలువల్లో పూడిక పేరుకుపోవడం, రిజర్వాయర్ల తూములకు సంబంధించిన షటర్లు సరిగ్గా లేకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, అశ్వరావుపల్లి, నవాబుపేట, మల్లన్నగండి రిజర్వాయర్ కట్టలపై తుమ్మ చెట్లు విపరీతంగా పెరిగి నడువడానికి వీలు లేకుండా పోయిందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాలువ పూర్తిగా మట్టితో కూడుకుపోయిందన్నారు. రిజర్వాయర్ల దిగువన పంటకాలువలు లేకపోవడంతో పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. కాలువల్లో కూడుకుపోయిన మట్టిని తొలగించాలని, రిజర్వాయర్ల తూములకు బిగించిన షటర్లకు మరమ్మతులు చేయడం కాని, లేదా వాటి స్థానాల్లో కొత్తవి బిగించడం కాని చేసి పొలాలకు నీరు అందించే చర్యలు చేపట్టాలని కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్ వరకు ఉన్నటువంటి ప్రధానకాలువకు లైనింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఓఅండ్ఎం) నాగేందర్, చీఫ్ ఇంజనీర్ రమేష్, ఎస్ఈ సుధీర్ పాల్గొన్నారు.

## మేడారంలో గిరిజన కళాకృత సమ్మేళనం

- టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ అరుణ్ కుమార్
- మ్యూజియం, హరిత హోటల్ సందర్శన



మ్యూజియం ఆవరణాన్ని పరిశీలిస్తున్న డైరక్టర్ అరుణ్ కుమార్

మేడారం, జనవరి 19: మేడారం మహాజాతరలో గిరిజన కళలు, హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ కళాకృత సమ్మేళనం నిర్వహించనున్నట్లు కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ డెవలప్‌మెంట్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మేడారం పర్యటనలో భాగంగా ఆదివాసీ మూజియం, హరిత హోటల్‌ను ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధిశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే సమ్మక్క సారలమ్మ మహా జాతరలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రకాల గిరిజన కళలు, హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్ కళాకృత సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో వివిధ రాష్ట్రాలకు చెందిన 20 మంది గిరిజన కళాకారులు గిరిజన కళలు, హ్యాండ్లూమ్స్, హ్యాండీ క్రాఫ్ట్స్‌ను విక్రయించనున్నామన్నారు. అదేవిధంగా కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో థీమ్ పెవిలియమ్ ఏర్పాటు చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన సంప్రదాయ సంస్కృతుల కళాఖండాలను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. మేడారం జాతరలో ఏర్పాటు చేయబోయే గిరిజన కళాకృత సమ్మేళనానికి అన్ని ఏర్పాట్లు చేపడుతామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కళాకారుల కోసం సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, మేడారం దేవాస్థానం నిర్వహణ అధికారి రాజేంద్రం, ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంతరావు, డీపీవో వెంకయ్య, ఐటీడీఏ ఎస్ఓ రాజ్‌కుమార్ తదితులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జిల్లా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించి అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల పనితీరు, వారి హాజరు, వైద్య పరికరాల పనితీరు, కావాల్సిన సౌకర్యాలు తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఆరేళ్లుగా సిటి స్కాన్ యంత్రం పనిచేయడం లేదని తెలుసుకొని కారణాలను అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామకు మెడికల్ కాలేజీ వచ్చినందున డాక్టర్ల సంఖ్య కూడా పెరిగిందని, రాబోవు రోజుల్లో మరింత మంది వైద్యులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. సిటి స్కాన్ యంత్రాన్ని అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తానని అన్నారు. చంపక్ హిల్స్ ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి మధ్య దూరం ఉన్నందున రవాణా సౌకర్యం విషయంలో చొరవ తీసుకుంటానన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా చూడాలని వైద్యులకు సూచించారు. జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్ వైద్యుల పనితీరు బాగా ఉందని, మరింత మెరుగుగా సేవలు అందించాలని అన్నారు. ఆయన వెంట జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధ, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, వైద్యులు డాక్టర్ సుగుణాకర్‌రాజు, నాయకులు బండ యాదగిరిరెడ్డి, ఉడుగుల నర్సింహులు తదితరులు ఉన్నారు.

# పతంగులు తెచ్చిన తంటా

## ఇద్దరిపై దాడి చేసిన యువకులు.. కేసు నమోదు

హనుమకొండ క్రైం, జనవరి 19: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎగురవేసే పతంగుల పండగ ఘర్షణకు దారి తీసింది. ఒకరి గాలిపటాన్ని మరొకరు ఒకరు తెంపేయడంతో ఏర్పడిన గొడవ కొట్లాటకు దారి తీసింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన చెన్నం నితిన్ సాయి ఈ నెల 16న తన ఇంటిపై గాలిపటం ఎగరేసుకుంటున్నాడు. ఇంటి సమీపంలో ఉన్న శివ, మింటూ, వీరస్వామి పతంగులు ఎగరేస్తున్నారు. ఈ క్రమంలో నితిన్ సాయి పతంగిని శివ, మింటూ, వీరస్వామిలు గాలిపటంతో కట్ చేశారు. విషయాన్ని నితిన్ సాయి తన తండ్రి శ్రీనివాస్‌కు చెప్పడంతో వారిని మందలించాడు. ఇది దృష్టిలో పెట్టుకున్న వారు ఇద్దరు శ్రీనివాస్, నితిన్ సాయిలపై పగ పెంచుకున్నారు. మరునాడు సాయంత్రం శ్రీనివాస్, నితిన్‌సాయిలు రెడ్డికాలనీలో వ్యక్తిగత పనిమీద వెళ్లి వస్తుండడంతో వారిని ముగ్గురు కలిసి అడ్డగించారు. నానా దుర్భాషలాడుతూ మీద పడి పిడి గుద్దులు గుద్దారు. దాడి చేసి చంపేస్తామని హెచ్చరించి వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు శ్రీనివాస్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కేయూ ఫార్మసీ డీన్‌గా గాదె సమ్మయ్య

కేయూ క్యాంపస్, జనవరి 19: కేయూ ఫార్మసీ నూతన డీన్‌గా ప్రొఫెసర్ గాదె సమ్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు వెలువరించారు. బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ గాదె సమ్మయ్యను వర్సిటీ ప్రొఫెసర్లు పి.మల్లారెడ్డి, ఎన్.ప్రసాద్, కృష్ణవేణి, నాగరాజు, పరిశోధకులు, విద్యార్థులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

# కాజీపేటలో చోరీ, నగదు మాయం

కాజీపేట, జనవరి 19: కాజీపేట జూబ్లీమార్కెట్‌లో ఓఇంట్లో చోరీ జరిగింది. దుండగులు నగదును దోచుకెళ్లారు కాజీపేట పోలీసుల వివరాలు ప్రకారం.. కాజీపేట జూబ్లీ మార్కెట్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. దుండగులు ఇంట్లో బీరువా తలుపులు తీసి అందులో ఉన్న నగదు రూ.2 లక్షల 48 వేలు దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాజీపేట, జనవరి 19: కాజీపేట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ 1లో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ గుర్తుతెలియని మృతదేహం లభించింది. మృతుడి వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఎత్తు 5.5, ఎరుపు, తెలుపు గడ్డం. పొడువైన ముఖం, సిమెంట్ కలర్ ప్యాంట్, బ్రింజాల్ కలర్ ఫుల్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో బాసర - రాజమండ్రి జనరల్ టికెట్ ఉంది. ఆనవాళ్ల బట్టి చూస్తే మృతుడు రాజమండ్రికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో బద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లో నైనా, 9866167291 లేదా 9440604320 కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

# పైపులైన్ గేట్ వాల్వ్ చోరీ

వేలేరు(ధర్మసాగర్), జనవరి 19: సాగునీటి పైపులైన్ గేట్ వాల్వ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ హరిత శుక్రవారం తెలిపారు. గుండ్లసాగర్ గ్రామం వద్ద పైపులైన్‌కు బిగించిన గేట్‌వాల్‌ను చోరీ చేశారు. దిని విలువ సుమారు రూ.25,000 వరకు ఉంటుందని పైపులైన్ ఇన్‌చార్జి గాదె రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


జంపన్నవాగు వద్ద పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

# పారిశుధ్యం పనుల పరిశీలన

## మేడారంలో పర్యటించిన ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, జనవరి 19: తాడ్వాయి మండలం మేడారంలో పారిశుధ్యం పనులను ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం తిరిగి పరిశీలించారు. జంపన్నవాగు, చిలుకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు వెంటవెంటనే పారిశుధ్యం పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహాజాతరకు సమయం దగ్గరపడుతున్నందు ముందస్తు మొక్కులు చెల్లించే భక్తుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. జంపన్నవాగులో భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు కాబట్టి.. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో ఉండాలన్నారు. సౌకర్యాల వద్ద సిబ్బందిని నియమించాలని డీపీవో వెంకయ్యను ఆదేశించారు.

అనంతరం టీటీడీ కల్యాణ మండపంలోని మీడియా పాయింట్ పరిశీలించారు. సమ్మక్క సారలమ్మల కీర్తిప్రతిష్ఠలు దేశ నలుమూలలా తెలియజేయడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జాతర కవరేజ్ చేయడానికి వచ్చే జర్నలిస్టులకు సదుపాయాలు, సౌకర్యాలు మేరుగా కల్పించాలని, భవనంలో చేయవల్సిన మరమ్మతులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, గ్రామ పంచాయతీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ముందస్తు మొక్కుల జోరు

## వనదేవతల సన్నిధికి 30వేలకు పైగా తరలివచ్చిన భక్తులు



మేడారం, జనవరి 19: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం 30వేల మందికిపైగా భక్తులు మేడారం తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీ దేవతలకు మహాజాతర ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ దూరప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ క్రమంలో మేడారం వచ్చిన భక్తులు ముందుగా జంపన్నవాగు పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారె కొబ్బరికాయలు బెల్లం( బంగారం) సమర్పించుకొని పూజలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని మేడారం ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేంద్రం తెలిపారు.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

# రేపే కొమురవెల్లి మల్లన్న పట్నంవారం

● మల్లన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం ● మూడునెలల జానపదుల జాతరకు అంకురార్పణ





చేర్యాల, జనవరి19: కొమురవెల్లి మల్లన్న ఆలయం పట్నంవారానికి సిద్ధమైంది. ఏడో తేదీన నిర్వహించిన స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా, ఆదివారం నిర్వహించనున్న పట్నంవారంతో మూడునెలల జాతరకు అంకురార్పణ పడనున్నది. ప్రతీ ఆదివారం 12 వారాల పాటు జానపదుల జాతర సాగనుంది. శివసత్తుల సిగాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల దరువుతో విజయాచల గుట్టలు మార్మోగనున్నాయి.

### పట్నంవారం అంటే..

సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తుండటం అనాదిగా వస్తోంది. మల్లన్న యాదవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవిని వివాహమాడిన నేపథ్యంలో యాదవులకు ఈ వారం అత్యంత ప్రీతికరం. హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తులు శనివారం ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుంటారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోకుండానే స్వామివారిని నేరుగా ధూళి దర్శనం చేసుకుంటారు. ఆదివారం తెల్లవారుజామునే తలనీలాలు అందించి పుణ్యస్నానమాచరిస్తారు. స్థానికంగా కూరగాయలు, మట్టికుండలు కొనుగోలు చేసి భక్తిప్రపత్తులతో బోనం తయారుచేస్తారు. సంప్రదాయబద్ధంగా మల్లన్నకు బెల్లంపాయసంతో బోనం నివేదిస్తారు. పట్నం వేసి సహంపక్తి భోజనం చేస్తారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యాలు సమర్పిస్తారు. అలాగే స్వామివారి తోబుట్టువు అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు చేసి నివేదిస్తారు. మరుసటి సోమవారం రోజున హైదరాబాద్‌కు చెందిన యాదవపూజారుల సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలను దాటుతారు. మల్లన్నను ఇతరుల రూపంలో భావించి వంటినిండా పసుపు ధరించి స్వామివారి ఆవాహనంతో అగ్నిగుండాల్లో చిందేసి తన్మయత్వం చెందుతారు. తరువాత వచ్చే ఆదివారాన్ని లష్కర్‌వారంగా పిలుస్తారు.

### ఈ యేడు 12 వారాల జాతర

గతంలో మల్లన్న ఆలయంలో కేవలం మూడు నెలల కాలంలో ఏడు వారాల్లోనే జాతర కొనసాగేది. దీంతో సత్తేటి వారాల జాతర అని పిలిచేవారు. అప్పట్లో భక్తుల రద్దీ అంత ఎక్కువగా లేకపోవడంతో మూడు నెలలు మాత్రమే ఆలయం తెరిచి ఉండేదని, మిగతా రోజుల్లో మూసి ఉండేదని పెద్దలు చెబుతుంటారు. కాలక్రమేణా ఏయేటికా యేడు భక్తుల రాక అధికమవుతుండటంతో జాతర సమయంతో పాటు సాధారణ రోజుల్లోనూ ఆలయం రద్దీగా మారుతోంది. తిథుల ఆధారంగా బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో ఒక్కోయేటా వారాల సంఖ్య పెరగడం, తగ్గడం జరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఈసారి 12 వారాలపాటు జాతర సాగనుంది.

21-01-2024 మొదటి వారం (పట్నంవారం)
28-01-2024 రెండో వారం (లష్కర్‌వారం)
04-02-2024 మూడోవారం
11-02-2024 నాలుగోవారం
18-02-2024 ఐదోవారం
25-02-2024 ఆరోవారం
03-03-2024 ఏడోవారం
08-03-2024 మహాశివరాత్రి
10-03-2024 ఎనిమిదో వారం
17-03-2024 తొమ్మిదో వారం
24-03-2024 పదోవారం
31-03-2024 పదకొండోవారం
07-04-2024 పన్నెండోవారం
(అగ్నిగుండాలతో సమాప్తం)

### భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



**బాలాజీశర్మ, ఆలయ ఈవో**

పట్నంవారంతో పాటు జాతర మూడునెలల కాలంలో మల్లన్న ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాం. భక్తులకు త్వరితగతిన దర్శనం కలిగించడంతో పాటు అందరికీ ప్రసాదం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. తాగునీటి వసతి కల్పించడంతో పాటు విద్యుత్ ఏర్పాట్లు చేపట్టాం. ఆలయ పరిసరాలతో పాటు పార్కింగ్ ప్రదేశాల్లో పారిశుధ్య చర్యలు నిరంతరం నిర్వహించేందుకు సిబ్బందికి సూచనలు చేశాం. భక్తులకు భద్రత కోసం పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. రాజగోపుర ఆవరణలో కంట్రోల్‌రూం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

# పార్లమెంట్ ఎన్నికలకు సీపీఐ సన్నద్ధం

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు

సుబేదారి, జనవరి 19: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఐ పార్టీ సన్నద్ధమవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు తెలిపారు. బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. జాతీయస్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో సీపీఐ ఒక స్థానం కోరుతోందని, అందులో వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని కోరుతున్నామన్నారు. ఈ క్రమంలో సీపీఐ పార్టీ వరంగల్ పార్లమెంట్ సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మీ, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, రాసమల్ల దీనా, రమేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

# ల్యాప్‌ట్యాప్ చోరీ

హనుమకొండ క్రైం, జనవరి 19: హనుమకొండ రాజాజీనగర్‌లోని ముక్తా బాయ్స్ హాస్టల్‌లో ఓ యువకుడి ల్యాప్‌ట్యాప్ చోరీ జరిగింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ జిల్లా ఫిష్‌మార్కెట్‌కు చెందిన తడకమల్ల వెంకటసుబ్బారావు హనుమకొండలో ఓ ప్రవేటు కంపెనీలో సేల్స్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రాజాజీనగర్‌లో ముక్తా బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తన హాస్టల్ గదితో ఉన్న ల్యాప్‌ట్యాప్ కనిపించకుండా పోయింది. హాస్టల్‌లో ఎంత వెతికినా, ఎంతమందిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

# దరఖాస్తుల ఆహ్వానం


హనుమకొండ రూరల్, జనవరి 19: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతిభా కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ పెద్దమ్మగడ్డలోని గిరిజన గురుకుల ప్రతిభా (బాలికల) కళాశాల ప్రిన్సిపాల్ నందమూరి పద్మిని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు www.tgtwgurukulam.telangana.gov.in, http://ttwreiscoe.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నెంబర్ 9121174434లో సంప్రదించాలని సూచించారు.

# నేడు, రేపు ఓటరు నమోదుపై ప్రత్యేక శిబిరాలు

హనుమకొండ రూరల్, జనవరి 19: ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 యేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్‌స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలన్నారు. సంబంధిత దరఖాస్తులు బూత్‌స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

# పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

హనుమకొండ అర్బన్, జనవరి 19: తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ బోర్డు ఉత్తర్వుల ప్రకారం వివిధ డిప్లొమా పారా మెడికల్ కోర్సులకు రెండో విడత, మాపప్ రౌండ్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ తెలిపారు. కాకతీయ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఉదయం 8.30 గంటలకు ఈ కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని, గత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు కూడా అర్హులేనని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివిధ రకాల పారా మెడికల్ కోర్సుల్లో 94 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.



# నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయింనగర్, జనవరి 19: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని రెవెన్యూకాలనీ, ప్రగతినగర్, నాగేంద్రనగర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా సోమిడి గ్రామం, విద్యానగర్, సెయింట్ ఆన్స్ స్కూల్ ఏరియా, మార్కెట్ ఏరియా ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అడ్వకేట్స్ కాలనీ-2, హంటర్‌రోడ్డు, వరంగల్ పబ్లిక్ స్కూల్ ఏరియా ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, స్నేహనగర్, రాఘవేంద్రనగర్, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, యాదవనగర్, క్రిష్ణ కాలనీ, దుర్గాకాలనీ, గౌతమినగర్, రెడ్డికాలనీ, పెట్రోల్ స్టేషన్, క్రాంతి బార్, పద్మశాలి భవన్ రాయపురవాడ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమాన్‌నగర్ డబ్బాల్, నగరవీధి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా జీఆర్ గుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని జీఆర్ గుట్ట, గిర్మాజిపేట, గ్రెయిన్ మార్కెట్, జేపీఎన్ రోడ్, లక్ష్మీపురం, మండిబజార్, చార్‌బౌళి ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా ఎస్ఆర్‌టీ కాలనీ, టీఆర్‌టీ కాలనీ, అబ్బనికుంట, యాకుబ్‌పూర్, ఈఎస్ఐ ఆస్పత్రి, జాన్‌పీర్లు, గొర్రెకుంట ఎక్స్‌రోడ్, నర్సంపేట రోడ్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, శంభునిపల్లి, ధర్మారం రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, కీర్తినగర్, గరీబ్‌నగర్, గొర్రెకుంట గ్రామం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటలవరకు, కరీమాబాద్ రోడ్, శాంతి నగర్, రామాలయం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, రంగశాయిపేట, మహంకాళి ఆలయం, హంస బేకరీ, కుమ్మరివాడ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, బెస్తం చెరువు, నక్కలపల్లి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, ఎల్‌బీ నగర్, తిలక్ రోడ్, మోయిన్‌పుర, వరంగల్ ఆస్పత్రి లైన్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, శాంతి నగర్, సెకండ్ బ్యాంక్ కాలనీ, గాయత్రికాలనీ, మార్కండేయ గుడి, 80 ఫీట్ రోడ్డు, భారతి డిగ్రీ కాలేజీ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రామన్నపేట, రఘునాథ కాలనీ, బీట్ బజార్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేషి మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# నిట్‌లో సాంకేతిక సంబురం

## ఉత్సాహంగా మొదలైన టెక్నోజియాన్



విద్యుత్ వెలుగుల్లో దగద్దాయమానంగా వెలిగిపోతున్న నిట్ కళాశాల భవనం

హనుమకొండ / కాజీపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో శుక్రవారం ప్రతిష్ఠాత్మక వార్షిక టెక్నికల్ ఫెస్ట్ టెక్నోజియాన్-2024 ఘనంగా ప్రారంభమైంది. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి సోమశేఖర్ టెక్నోజియాన్-2024ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నోజియాన్-2024 నిర్వహణకు సమర్థవంతమైన ప్రణాళికను రూపొందించినందుకు స్టూడెంట్ ఆర్గనైజింగ్ టీమ్‌ను అభినందించారు. టెక్నోజియాన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. టెక్నోజియాన్ వంటి టెక్నోఫెస్టులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికియడంతో పాటు వారి పరస్పరం తమ అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకునేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. రానున్న రెండు రోజులు విద్యార్థులు నూతన సాంకేతిక అవిష్కరణలను ఆకళింపు చేసుకునేందుకు, సాంకేతిక విజ్ఞానాన్ని మరింత పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడగలవన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిక్రిష్ణ, ఫ్యాకల్టీ అడ్వయిజర్ ప్రొఫెసర్ హరి ప్రసాద్‌రెడ్డి ఈ సందర్భంగా హాజరయ్యారు.

### మూడురోజులపాటు..

ఈ టెక్నోజియాన్‌లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ నిట్ కళాశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే టెక్నోజియాన్‌లో భాగంగా 40కిపైగా ఈవెంట్లను ప్రదర్శిస్తారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందచేస్తారు. వరంగల్ నిట్‌లో 2006 నుంచి క్రమం తప్పకుండా ప్రతీఏటా ఈ టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం కొత్త ఇతివృత్తంతో దీనిని జరపడం ఆనవాయితీ. ఈ సంవత్సరం ఇంజినియస్ థీమ్‌తో దీనిని నిర్వహిస్తున్నారు. అన్వేషణ, సృజనాత్మకత, సాంకేతిక పరివర్తన స్ఫూర్తికి ప్రతీకగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. దీనికి అనుగుణంగా టెక్నోజియాన్‌లో నిర్వహించే ఈవెంట్లు, ఎగ్జిబిట్లు, చర్చలు, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయి.

### చివరి నిమిషంలో మార్పు

వాస్తవానికి టెక్నోజియాన్-2024 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రఖ్యాత ఏరోస్పేస్, మిస్సైల్ సైంటిస్టు ప్రొఫెసర్ సుందరరాజన్ హాజరు కావలసి ఉంది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌కు చెందిన బ్రహ్మోస్, అగ్ని, పృథ్వీ, ఆకాశ్, నాగ్, త్రిశూల్ వంటి అత్యంత శక్తివంతమైన క్షిపణుల రూపకల్పన, ఉత్పత్తి, అభివృద్ధిలో కీలకభూమి పోషించిన సుందరరాజన్ రాకకోసం విద్యార్థులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఆయనను కలవడానికి ఉత్సాహపడ్డారు. కానీ అకస్మాత్తుగా ఆయన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ప్రారంభోత్స కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. దీంతో చివరి నిమిషంలో కార్యక్రమంలో మార్పు జరిగింది. ప్రొఫెసర్ సుందరరాజన్ స్థానంలో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి సోమశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై టెక్నోజియాన్‌ను ప్రారంభించారు.

### ప్రముఖుల ప్రసంగాలు

టెక్నోజియాన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సాంకేతిక నిపుణులు విద్యార్థులకు మార్గదర్శనం నెరుపనున్నారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులపై విద్యార్థులతో చర్చించనున్నారు. రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం, ఇస్రో శాస్త్రవేత్త టీఎస్ సురేష్‌కుమార్, ఇన్‌ఫ్లుయన్సర్ వంశీ కూరపాటి తదితరులు టెక్నోజియాన్‌కు హాజరవుతున్న ప్రముఖుల్లో ఉన్నారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఉన్నాయి.

### 40కిపైగా ఈవెంట్లు

ఈ ఫెస్ట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించడానికి 40కిపైగా టాప్ క్లాస్ ఈవెంట్లను నిర్వహిస్తారు. ఈ వెంట్లను తిలకించేందుకు నిట్ విద్యార్థులే కాకుండా బయట వివిధ ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలలకుచెందిన విద్యార్థులు కూడా పెద్దసంఖ్యలో హాజరుకానున్నారు. టెక్నోజియాన్ సందర్భంగా నిర్వహించే ఈవెంట్లలో జహాజ్, ఆర్‌సీ బగ్గీ, హోవర్ మానియా, విర్చువల్ రియాలిటీ, డీబగ్గింగ్ మానియా మొదలైనవి ఉన్నాయి. ఈ రెండురోజుల్లో మ్యాట్ ల్యాబ్, టీవర్క్స్ ద్వారా రాపిడ్ ప్రోటోటైపింగ్, సిమ్యూలింక్ మాస్టర్, ఇన్నోసెర్ఫ్ తదితరవాటిపై వర్క్‌షాపులు కూడా ఉంటాయి. నిట్‌లోని ప్రతీ డిపార్ట్‌మెంట్ వివిధ సాంకేతిక కార్యక్రమాలను, క్విజ్‌లను నిర్వహిస్తాయి. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన స్పర్ధక్ బృందం వాహన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకోనున్నది.

### తొలి రోజు

తొలిరోజు ఈవెంట్లు మధ్యాహ్నం 2 గంటల నుంచి మొదలయ్యాయి. మెటాల్యూజన్, ప్లేజో పవర్ ఆర్కెడ్, రీసెర్చ్ నెక్సెస్, బయో హాక్, లెర్న్ అండ్ ఎర్న్ ఎలక్ట్రిసిటీ, ఆటోమిఇన్‌సైట్, బీసీ ట్రేడింగ్ పిట్, బ్రెయిన్ గేమ్ పోస్టర్ గాలా, కెమ్ ఈ ఎక్స్‌టెంపోర్, ఆర్బిక్స్ ఆర్‌సీ బగ్గీ, పజిల్ టు పేపర్, ఇన్నోకెమ్, మోడల్ డెమాన్‌స్ట్రేషన్, మైండ్ గ్రిండ్, ఏసీ సెలస్టియల్ క్లీనప్, హెచ్‌బీఏన్ ఓరిగామి, ఎన్‌హెచ్ ఇన్నోవేట్, ఎస్‌డీసీ క్రాక్ దక్వ్రేరీ ఆర్కాడేరియం, ఆర్‌సీ బోట్‌ఆర్కేడ్, రీసెర్చ్ ఒడిస్సీ ప్రింట్ యువర్ ప్రాజెక్టు తదితర వీటిలో ఉన్నాయి.

ఈవెంట్లు మధ్యాహ్నం 3గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఎనిమిది ఈవెంట్ల మొదటి రౌండ్‌ను టెక్నోజియాన్ ప్రారంభోత్సవానికి ముందు నిర్వహించారు.


టెక్నోజియాన్-2024 నిర్వహిస్తున్న విద్యార్థుల బృందం


పాఠశాల విద్యార్థులు రూపొందించిన డిటెక్టర్ ఎగ్జిబిట్లు

# ఆకట్టుకుంటున్న ఈవెంట్లు, ఆవిష్కరణలు

## ప్రతిభను చాటుతున్న విద్యార్థులు.. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు

హనుమకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టెక్నోజియాన్‌లో నిర్వహిస్తున్న ఈవెంట్లు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలోచింపచేస్తున్నాయి. వీటిని తిలకించేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. వీటిలో మచ్చుకు కొన్ని..

### ట్రేడింగ్ పిట్ :



స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ప్రపంచం ఎలా ఉంటుందో విద్యార్థులకు అనుభవపూర్వకంగా తెలియచేయడం ఈ ఈవెంట్ ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో పాల్గొనేవారు రియల్ టైమ్ (నిజ సమయం), స్టాక్ ట్రేడింగ్ సాదృశ్యాలలో పాల్గొంటారు. వీరు స్టాక్ మార్కెట్లలో రియల్ టైమ్‌లో పెట్టుబడులు పెట్టే అనుభూతిని ప్రత్యక్షంగా పొందుతారు. అనుభవాన్ని గడిస్తారు. స్టాక్ ట్రేడింగ్‌లో ఎక్కువ డబ్బు సంపాదించిన విద్యార్థులను విజేతలుగా ప్రకటిస్తారు.

### ఆర్బిక్స్



ఉపగ్రహ ప్రయోగాలు, అంతరిక్ష వికిరణాల ద్వారా ఉత్పత్తయ్యే ఈ-వ్యర్థాల వల్ల పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించడానికి కొన్ని క్షేత్రస్థాయిలో వినూత్నమైన రీతిలో విద్యార్థులు తమ ఆలోచనలు పంచుకునేందుకు వీలుకల్పించడం ఈ ఈవెంట్ లక్ష్యం. ఇందులో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై తమ ఆలోచనలను వివరించారు.

### క్రాక్ ది క్వెరీ



క్రాక్ ది క్వెరీ అనేది ఎస్‌క్యూఎల్ కోడింగ్ పోటీ. ఇందులో పాల్గొనేవారు ఎస్‌క్యూఎల్‌ని ఉపయోగించి సవాళ్లను ఎదుర్కొంటారు.

### ఇన్నోకెమ్



సుస్థిరమైన పర్యావరణను ప్రోత్సహించడానికి విద్యార్థులు తాము చేసిన పరిశోధనలను వివరించేందుకు వేదిక కల్పించడం ఈ ఈవెంట్ ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో భాగంగా విద్యార్థులు సుస్థిర పర్యావరణంపై విద్యార్థులు వివిధ అంశాలను ప్రదర్శించారు.

### హ్యాండ్ ఇన్ ప్రింట్

విద్యార్థులు తమ స్నేహితులతో గడిపిన క్షణాలను చిరకాలం జ్ఞాపకం ఉండే గుర్తులే హ్యాండ్ ఇన్ ప్రింట్ ఈవెంట్. ఒక రసాయనంలో తమ చేతులను ముంచి ఒక తెల్లని వస్త్రంపై అద్దితే ముద్రలు పడతాయి. వాటిని గుర్తుగా తమ వద్ద ఉంచుకోవచ్చు.

### వీఆర్ గేమింగ్



ఇది ఒక విచిత్రమైన ఆట. మైదానంలోకి వెళ్లి క్రికెట్ ఆడడంలో పొందే అనుభూతిని కేవలం కళ్ళకు ప్రత్యేకంగా రూపొందించిన గ్లాస్‌లను పెట్టుకోవడం ద్వారా పొందవచ్చు. ఈ గ్రాస్‌లను ధరించి బ్యాట్‌తో బాల్‌ను కొడితే గ్రౌండ్‌లో నిజంగా ఆడినట్టే ఉంటుంది.

### విద్యార్థులకు ప్రత్యేకంగా..



ఈ టెక్నోజియాన్‌లో నిట్ విద్యార్థులే కాకుండా పాఠశాల విద్యార్థులు సైతం తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఆయా సైన్స్‌ఫేయిర్లలో ప్రదర్శించిన తమ ఎగ్జిబిట్లను టక్నోజియాన్‌లో కూడా ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. నిట్ విద్యార్థులతో పోటీ పడేలా వీరి ఎగ్జిబిట్లు ఉన్నాయి.

## పాలకుర్తిలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



పాలకుర్తి చౌరస్తాలో కవాతు నిర్వహిస్తున్న జవాన్లు

పాలకుర్తి, జనవరి 19: మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా నాలుగు రోడ్ల కూడళ్లలో 65 మంది రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు శుక్రవారం కవాతు చేశాయి. ఈ సందర్భంగా సీఐ విశ్వేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు హకీంపేట నుంచి వచ్చిన 99 బెటాలియన్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంటుందని అన్నారు. ముఖ్యంగా శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలుగకుండా ఈ ఫోర్స్ పని చేస్తుందని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలుతీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ టీపీ బాగెల్, అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవార్, పాలకుర్తి, కొడకండ్ల ఎస్సైలు శ్రీకాంత్, శ్రావన్‌కుమార్, లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ విధానాలపై ఉద్యమిస్తాం: సీఐటీయూ

జనగామ టౌన్, జనవరి 19: బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపడుతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్‌వీ.రమ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్లుగా బీజేపీ అనుసరించిన విధానాల వల్ల దేశం దివాళా తీసిందన్నారు. దేశానికి తిండి పెట్టే రైతులపై అనేక భారాలు మోపారని ఆరోపించారు. వామపక్షాల పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్ర విధానాలకు నిరసనగా ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 16 వరకు వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంఘాల నేతలు రాపర్తి సోమయ్య, సింగారపు రమేశ్, బొట్ల శ్రీనివాస్, రాపర్తి రాజు, భూక్య చందునాయక్, పొత్కనూరి ఉపేందర్, చుంచు విజేందర్, కొడెపాక యాకయ్య పాల్గొన్నారు.

## రామాలయంలో ఘనంగా సంప్రోక్షణ



సంప్రోక్షణ పూజలు నిర్వహిస్తున్న పూజారి మోహన కృష్ణ భార్గవ

జనగామ కల్చరల్, జనవరి 19: అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానార్చకుడు మోహన కృష్ణ భార్గవ నేతృత్వంలో మహిళలు దేవాలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసి సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు జిల్లా ప్రముఖ్ దొంతుల శేఖర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో ఈ నెల 22న వేడుకలు నిర్వహించాలన్నారు. దేవాలయాల్లో ప్రత్యక్ష ప్రసారాలు ఏర్పాటు చేసుకొని సామూహికంగా వీక్షించాలన్నారు. ఇది యావత్ భారతదేశం లోనే అత్యంత వైభవోపేతమైన పర్వదినంగా భావించాలన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరాంనగర్ కాలనీ శ్రీ హనుమత్ రామనాథ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మోహన కృష్ణ భార్గవ మాట్లాడుతూ సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పజ్జూరి లక్ష్మీనర్సయ్య, గునిగంటి రామకృష్ణ, బచ్చు బాలనారాయణ, ఎలసాని కృష్ణమూర్తి, రాంబాబు, కల్లెం నాగరాజురెడ్డి, రవి రెడ్డి, రాజేశ్వర్ భార్గవ, యాదగిరిరెడ్డి, మహిళా భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

● వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ, ఆర్టీవో అధికారులు

హనుమకొండ క్రైం, జనవరి 19: ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను నివారించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించే రోడ్డుభద్రతా మాసోత్సవాల సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆర్టీవో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా చాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ మార్కెట్‌లతో పాటు ఇతర శాఖల ప్రతినిధులలతో కలిపి మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను సీపీ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో గంటకు 50కిపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే 19 మంది మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోజు రోజుకూ వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో అదేస్థాయిలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ప్రధానంగా హైస్పీడ్ వాహనాల వినియోగంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ప్రజలతో పాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్డు సేఫ్టీ విభాగం ఇన్‌స్పెక్టర్ రవి రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకోవలసిన మెళకువలు విశ్లేసించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారి పురుషోత్తం, ఆర్టీవో రంగారావు, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేష్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు జి.సీతారెడ్డి, సుజాత, ఎంవీఐలు రమేష్ రాథోడ్, రవీందర్, స్వర్ణలత, శాలినీ, ఫహిమా, శ్రీనివాస్‌లతోపాటు చాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ మార్కెట్ నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు ఇప్పించండి

కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన సర్పంచ్‌లు



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న జఫర్‌గడ్ మండల సర్పంచ్‌లు

జఫర్‌గడ్, జనవరి 19 : పదవీ కాలాన్ని పెంచడంతో పాటు తాము చేసిన పనుల బకాయి బిల్లులు చెల్లించాలని కలెక్టర్ శివలింగయ్యను మండల సర్పంచ్‌లు కోరారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు జనగామలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంగా పాలనాపరమైన, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సర్పంచ్‌లుగా ఎన్నికైన 2019లో మే, జూన్ నెలల్లో ఎంపీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగడంతో పాటు ఇదే ఏడాది అక్టోబర్ నుంచి 8 నెలల వరకు చెక్ పవర్ లేకుండా పోయిందన్నారు. అలాగే కరోనా వ్యాప్తితో 2020 నుంచి 2022 వరకు రెండేళ్లు పదవీ కాలం వృథా అయిందన్నారు. పంచాయతీల అభివృద్ధికి రావాల్సిన రాష్ట్ర ఎస్ఎఫ్‌సీ నిధులు రెండేళ్లుగా రావడం లేదన్నారు. కేంద్ర ఆర్థిక అభివృద్ధి నిధులు సైతం 14 నెలల పాటు పంచాయతీల ఖాతాల్లో జమ కాలేదన్నారు. తాము అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, వాటికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి డబ్బులు ఇప్పించాలని కోరారు. అదేవిధంగా పాలనా పరంగా పదవీ కాలం వృథా అయినందున రెండేళ్ల పాటు సర్పంచ్‌ల ఆ మేరకు పొడిగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వారిలో తీగారం, సాగరం, తిమ్మంపేట, ఏబీ తండా, రేగడితండా, తిమ్మాపూర్, కోనాయిచలం, సూరారం, లక్ష్మీనాయక్‌తండా సర్పంచ్‌లు గోనె జయపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఎస్.సంపత్‌రెడ్డి, మంద మల్లేశ్, బానోత్ తులసమ్మ, పొన్నల జ్యోతి నాగరాజు, భూక్య పార్వతి రవి, గుగులోత్ వసంత రాములు, మేడిపల్లి రాజేశ్వరి శ్రీనివాస్ ఉన్నారు.

# 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

● షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ



కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న డీసీఈబీ సహాయ కార్యదర్శి మెర్గు రామరాజు

జనగామ కల్చరల్, జనవరి 19: సుదీర్ఘ విరామం తర్వాత సర్కారు బడుల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ఈ నెల 29న నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలోని 535కు పైగా బడుల్లో కొత్త ఎస్ఎంసీలు కొలువుదీరనున్నాయి. ఈ మేరకు డీఈవో కె.రాము జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వాహకులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ నర్సింహారావు, డీసీఈబీ సెక్రటరీ చంద్రభాను, సహాయ కార్యదర్శి మెరుగు రామరాజు పాల్గొని పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఎస్ఎంసీలకు చివరిగా 2019 డిసెంబరులో ఎన్నికలు జరుగగా వీటి గడువు 2021 డిసెంబరుతో ముగిసింది. కరోనా తరువాత పరిస్థితుల కారణంగా వీటి కాలపరిమితిని పలుసార్లు పొడిగిస్తూ వచ్చారు.

**- షెడ్యూల్ ఇలా ...**

జనవరి 20న ఉదయం 10 గంటలకు ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదే రోజు 2 గం.లకు అర్హులైన తల్లిదండ్రుల జాబితాను బడుల్లో ప్రదర్శిస్తారు. 22, 23 తేదీలలో జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా ప్రకటన. 29న ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల నిర్వహణ. 1.30 గం.లకు ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహిస్తారు.

**ఎన్నిక ఇలా ...**

చైర్మన్, వైస్ చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు మరో ఐదుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్టెడ్ సభ్యులు ఉంటారు. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 50 శాతం తల్లిదండ్రులు ఎన్నికలు నిర్వహించే సమావేశానికి హాజరు కావాలి. చేతులెత్తే లేదా వాయిస్ ఓటింగ్ ద్వారా ఎన్నికలు జరుగుతాయి. హెచ్ఎంలు ఈ ఎన్నికలను నిర్వహిస్తారు.

## ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపెయిన్లు: కలెక్టర్

జనగామ టౌన్, జనవరి 19: ఎమ్మెల్సీ, ఎంపీ ఎలక్షన్ల నేపథ్యంలో ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపెయిన్లు నిర్వహించాలని కలెక్టర్ శివలింగయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదు ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. డూప్లికేట్ ఓట్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఫామ్ 6, 7, 8పై వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు పింకేశ్‌కుమార్, సుహాసిని, ఆర్డీవోలు మురళీకృష్ణ, రాంమూర్తి, కలెక్టరేట్ ఏవో రవీందర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీఐవో రాంప్రసాద్, ఈడీఎం దుర్గారావు, డీపీవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

## కేంద్ర నిబంధనలు పాటించాలి

ఐటీ జాయింట్ కమిషనర్ మహేంద్ర



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మహేంద్ర

జనగామ టౌన్, జనవరి 19: ఆదాయ పన్ను చెల్లింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనలపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ టి.మహేంద్ర, అడిషనల్ కలెక్టర్ సుహాసిని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఈ-టీడీఎస్ ఫైలింగ్‌పై అన్ని శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదాయ పన్నుల చెల్లింపు, త్రైమాసిక, వార్షిక ఆదాయం దాఖలుపై కేంద్ర ప్రభుత్వ ఆదాయ పన్ను శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి మాధవి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అధికారులు పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. టీడీఎస్ క్వార్టర్లీ స్టేట్‌మెంట్ సమయానికి ఫైల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీవో పి.నరసింహారెడ్డి, ఏటీవో రాజేంద్రకుమార్, ఇన్‌స్పెక్టర్ గీత, ఎస్టీవో కె.శ్రీనివాస్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి దుర్గామాత ఉత్సవాలు

బచ్చన్నపేట, జనవరి 19: మండలంలోని కొన్నె గ్రామంలో రెండు రోజుల పాటు జరగనున్న దుర్గామాత ఉత్సవాలు శనివారం ప్రారంభమవుతాయని సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శనివారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయని, గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తామని, సాయంత్రం అమ్మవారికి పట్నం వేసి, బోనాలతో మొక్కులు చెల్లిస్తారని, రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు దుర్గామాత కల్యాణోత్సవం, మహిమలపై డబ్బుల వారిచే ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఆదివారం తెల్లవారుజామున నాగవెల్లి కార్యక్రమం నిర్వహించి బలిహరణ నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం అమ్మవారికి ఓడిబియ్యం పోసి, వనభోజనాలకు వెళుతారని వివరించారు. జీపీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ సతీష్ సూచించారు.

## చెన్నూరు విద్యార్థినికి వెండి పతకం



వెండి పతకం, ట్రోఫీతో అఖిల

పాలకుర్తి, జనవరి 19 : మండలంలోని చెన్నూరు జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థిని మొలుగూరి అఖిల కబడ్డీలో వెండి పతకం సాధించింది. ఎనిమిదో తరగతి చదువుతున్న అఖిల ఈ నెల 16, 17, 18 తేదీల్లో జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 67వ అంతర్ రాష్ట్ర పాఠశాలల కబడ్డీ పోటీల్లో 14 సంవత్సరాల విభాగంలో ప్రతిభ చూపిం ది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్యాంసుందర్‌రావు, పీఈటీ శ్రీనివాస్ మాట్లాడుతూ జనగామలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్ రాష్ట్ర పోటీలలో ఉమ్మడి వరంగల్ కబడ్డీ ద్వితీయ స్థానం సాధించగా, జట్టులో ఉన్న క్రీడాకారులందరూ సిల్వర్ పతకాలు సాధించారని అన్నారు. అనంతరం అఖిలను సర్పంచు పార్వతీ రాజేశ్వరరావు, ఎంపీటీసీ కళింగరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## నేడు పట్టణంలో కరెంట్ బంద్

జనగామ టౌన్, జనవరి 19: జనగామ పట్టణంలోని అన్ని ప్రాంతాలలో శనివారం రెండున్నర గంటల పాటు కరెంట్ సరఫరా బంద్ ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శంకర్ ప్రకటించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేయాల్సిన కారణంగా ఉదయం 8:30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నాకే ఆబ్సెంట్ వేస్తావా? మీ అంతు చూస్తా..!

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిపై చేయి చేసుకున్న ఏడీఏ

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 19: నీ అంతు చూస్తా... నాకే ఆబ్సెంట్ వేస్తావా..? అంటూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్‌పై ఏడీఏ శ్రీధర్ దాడికి దిగారు. మీరు జిల్లాలో ఎలా పనిచేస్తారో చూస్తానని డీఏవోను చెంపదెబ్బ కొట్టడంతో పాటు కార్యాలయంలోనే ఏడీఏ బెదిరింపులకు పాల్పడ్డాడు. జిల్లా వ్యవసాశాఖ అధికారి విజయ్ భాస్కర్‌పై ఏడీఏ టెక్నికల్ శ్రీధర్ చేయి చేసుకోవడం భూపాలపల్లి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. విధులకు సెలవు పెట్టకుండా గైర్హాజరు కాగా, ఆబ్సెంట్ వేయడంతో ఏడీఏ శ్రీధర్ వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ్‌భాస్కర్‌పై భూపాలపల్లిలోని వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం దాడికి పాల్పడ్డారు. ఏడీఏ దాడిపై కలెక్టర్ భవేష్ మిశ్రాకు విన్నవించడంతో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విజయ్ భాస్కర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాధితుడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్ వెల్లడించిన వివరాల ప్రకారం... ఈ నెల 17, 18 తేదీల్లో ఏడీఏ టెక్నికల్ శ్రీధర్ సెలవు పెట్టకుండా, ముందస్తు అనుమతి లేకుండా విధులకు హాజరుకాకపోవడంతో గైర్హాజర్ వేశాడు. దీంతో శుక్రవారం కార్యాలయానికి వచ్చిన శ్రీధర్.. తనకే ఆబ్సెంట్ వేస్తావా..? అని చెంపపై కొట్టి బెదిరించాడు. సిబ్బంది విధులకు హాజరు కాకపోతే ఆబ్సెంట్ వేసే అధికారం తనకు ఉందని, అందుకే గైర్హాజర్ వేశానని, ఏడీఏ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌భాస్కర్ ఉన్నతాధికారులను కోరారు.

# ఆక్రమిత ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

● సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్

జఫర్‌గడ్, జనవరి 19: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని 1645 సర్వే నంబరులో ఉన్న రెండున్నర ఎకరాల సర్కారు భూమిని శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ జిల్లాలో గత ప్రభుత్వ పాలనలో ఎక్కడ సర్కారు భూమి ఉంటే అక్కడ ఆక్రమించారని ఆరోపించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం స్పందించి ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు వేసి ఆక్రమణకు గురికాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆ భూములను పేదలకు పంచుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు కూరపాటి చంద్రమౌళి, ఎండీ.యాకూబ్‌పాషా, ముసలయ్య, పెండ్యాల సమ్మయ్య, ఖలీల్, చంటి, తాడెం కుమార్ పాల్గొన్నారు.

## తొలగించారు.. వదిలేశారు



బొడ్రాయి దగ్గర గౌడ కాలనీలో రోడ్డుకు అడ్డంగా పడేసిన చెట్ల కొమ్మలు

జనగామ టౌన్, జనవరి 19: విద్యుత్ వైర్లకు అడ్డు వస్తున్నాయని తొలగించిన చెట్ల కొమ్మలు ఇప్పుడు రోడ్డుకు అడ్డంగా మారాయి. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం జనగామ పట్టణంలోని బొడ్రాయి ఏరియాలో కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టి కొమ్మలను రోడ్డుపై పడేశారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ వారిని అడిగితే మునిసిపాలిటీ వారు తొలగిస్తారని చెప్పారని, మునిసిపల్ జవాన్లను అడిగితే కొట్టేసిన వారే తీస్తారని చెబుతూ ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఎవరో ఒకరు వాటిని తొలగించాలని కోరుతున్నారు.

## డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

బచ్చన్నపేట, జనవరి 19: మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి శుక్రవారం పంచాయతీ కార్యదర్శి భానుచందర్, ఉపసర్పంచ్ గుర్రాల సిద్దారెడ్డి భూమిపూజ చేశారు. రూ. 2 లక్షల జడ్పీ నిధులతో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఆజామ్, గిరబోయిన అంజయ్య, మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి, గుర్రాల నర్సిరెడ్డి వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## దశమంతరెడ్డికి బీజేపీ నేతల సన్మానం

జఫర్‌గడ్, జనవరి 19 : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండో సారి నియమితులైన ఆరుట్ల దశమంతరెడ్డిని ఆ పార్టీ నేతలు సన్మానించారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ జీవీఆర్, జిల్లా నాయకులు అంజిరెడ్డిలతో కలిసి శుక్రవారం జఫర్‌గడ్ మండల అధ్యక్షుడు తౌటి సురేశ్ గౌడ్, జిల్లా నేత బుర్ర తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, దళిత మోర్చా ఉపాధ్యక్షుడు గాదెపాక శ్రీను తదితరులు జనగామలో దశమంతరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## న్యాయ సేవాధికార సంస్థ అండ..

హత్య కేసు నుంచి బయటపడ్డ యువకుడు

జనగామ టౌన్, జనవరి 19: న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని నిందితుడికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా నిలిచింది. హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి తరఫున కేసు వాదించి హత్యా ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తిని గెలిపించింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. తరిగొప్పుల మండలం సోలిపురం గ్రామానికి చెందిన వంగ పరుశరాములుకు 2020లో తండ్రి కృష్ణమూర్తితో పలుమార్లు గొడవ జరిగింది. అదే సంవత్సరం ఓ రోజు ఇద్దరి మధ్య గొడవ జరగగా పరుశరాములు నెట్టివేయగా తండ్రి కృష్ణమూర్తి కింద పడడంతో తలకు గాయమైంది. ఈ ఘటన జరిగిన రెండు నెలలకు కృష్ణమూర్తి మృతిచెందాడు. కాగా, కృష్ణమూర్తి మృతికి పరుశరాములే కారణమంటూ తరిగొప్పుల పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. దీంతో ఆయన 45 రోజులు జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. ఆ కేసు కోర్టులో ఉండగా తనకు న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేదని జిల్లా న్యాయాధికార సేవా సంస్థను ఆశ్రయించాడు. దీంతో ఆ సంస్థ నిందితుడి తరఫున వాదించేందుకు కొన్ని రోజుల క్రితం చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మంచాల రవీందర్‌ను నియమించింది. రవీందర్ వాదించిన కేసును పరిశీలించిన జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ శుక్రవారం కొట్టివేశారు. దీంతో నిందితుడికి ఉపశమనం లభించింది.

## సిబ్బంది సమయపాలన పాటించాలి

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి మనోహర్



మల్యాపూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ మనోహర్

చిలుపూర్, జనవరి 19: పశు వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్ఎల్ మనోహర్ సూచించారు. శుక్రవారం మల్కాపూర్ పశు వైద్యశాలను సందర్శించిన ఆయన వ్యాక్సినేషన్, మందుల వివరాలతో పాటు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్కాపూర్ ప్రధాన ఆస్పత్రితో పాటు, ఆయా గ్రామాల్లో గల సబ్ సెంటర్లలో సేవలందిస్తున్న సిబ్బంది పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, వివిధ సీజన్లలో సంక్రమించే వ్యాధులకు మందులతో పాటు, వ్యాక్సినేషన్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జంతు సంరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనేష్, సిబ్బంది భిక్షపతి, ఫయాజ్, నాగరాజు, ఉపాధ్యాయులు రవికుమార్, వేణుగోపాల్ రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: డీటీఎఫ్



డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో కె.రాము తదితరులు

జనగామ కల్చరల్, జనవరి 19: నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఇప్ప రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.దివాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం జనగామ జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డీఈవో కె.రాము సమక్షంలో డీటీఎఫ్ 2024 నూతన డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటగా విద్యారంగంతో సంబంధం ఉన్న మేధావులు, అధికారులతో పాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం విద్యారంగాన్ని సమీక్షించాలన్నారు. డీఎస్సీ నిర్వహించి తరగతికో ఉపాధ్యాయుడు ఉండేలా నియామకాలు చేపట్టాలన్నారు. విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్‌లో నిధుల కేటాయించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో అధ్యాపక జ్వాల సంపాదకవర్గ సభ్యురాలు జి.కళావతి, జిల్లా కమిటీ సభ్యులు చొక్కయ్య, శ్రీనివాసాచారి, నాగేందర్, అఫ్సర్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.